చందన చెరువులో ఆక్రమణకు గురైన ప్రాంతం

మార్క్ చేసిన భాగం చందనచెరువులో ఆక్రమణకు గురైన ప్రాంతం

చందన చెరువు శిఖం ఫలహారం

రౌతు మెత్తనైతే... గుర్రం ముందరి కాళ్ల మీద లేస్తుందట! హైదరాబాద్ శివారులోని చెరువుల దుస్థితి కూడా ఇలాగే ఉన్నది. అందునా హెచ్ఎండీఏ చెరువులంటే అందరికీ అలుసే. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో చూడరు. రెవిన్యూ, మున్సిపల్ అధికారులది 'మాకేం సంబంధం?' అనే ప్రశ్న! చివరకు కాంక్రీట్ జంగిల్‌లో భూగర్భ జలాలకు జీవంలాంటి నీటి వనరులు కాల గర్భంలో కలిసిపోతున్నాయి. తాజాగా చందన చెరువు పరిధిలో ఇద్దరు వ్యక్తులు ఏకంగా 36 గుంటల భూమిని ఆక్రమించి, అధికారికంగా క్రమబద్ధీకరించుకొనేందుకు స్కెచ్ వేసినట్టు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ దృష్టికి చేరింది. దీంతో కబ్జా స్కెచ్‌పై విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో మాత్రం అధికారుల అడుగులు ముందుకు పడటం లేదు.

50 కోట్ల విలువైన 36 గుంటల కబ్జాకు స్కెచ్

- నకిలీ పాసు పుస్తకాలతో కరెంటు కనెక్షన్
- 59 జీవో కింద క్రమబద్ధీకరణకు ప్రణాళిక
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదుతో విచారణకు ఆదేశం

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 18 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా కందుకూరు డివిజన్, జల్‌పల్లి గ్రామ పరిధిలోని చందన చెరువు దాదాపు 34.1 ఎకరాల్లో విస్తరించి ఉన్నది. జీహెచ్ఎంసీ పరిధికి కూతవేటు దూరంలోనే ఉన్న ఈ చెరువు చుట్టు పక్కల ప్రాంతం వాణిజ్య, నివాసపరంగా ఎంతో అభివృద్ధి చెందింది. ఆర్‌సీఐ (రిసెర్చ్ సెంటర్ ఇమారత్)కు ఇక్కడి నుంచే వెళ్లాల్సి ఉన్నందున 1990లో ప్రభుత్వమే చెరువు శిఖంలోంచి రోడ్డు వేసింది. రోడ్డు అవతల కూడా ఎఫ్‌టీఎల్ భూములు ఉండటంతో అక్కడి వరకు సర్వే చేసి హద్దులు నిర్ధారించింది. ఇప్పటికీ ఆ హద్దు రాళ్లు ఉన్నాయి. ఆర్‌సీఐకి ఈ చెరువు నుంచి నీటిని సరఫరా చేసేందుకు శిఖంలో ఒక ట్యాంకు కూడా నిర్మించారు. అయితే, విస్తరించిన పట్టణీకరణ దరిమిలా ఈ ప్రాంతం రద్దీగా మారటంతో రోడ్డును వంద ఫీట్లకు విస్తరించారు. దీంతో రోడ్డు అవతల ఉన్న శిఖం భూములపై కొందరి కన్నుపడింది. కాలక్రమేణా ఇంతింతై అన్నట్టు శిఖం భూములు ఫలహారంగా మారుతూ వస్తున్నది. ఇందులో భాగంగా కొన్నిరోజుల కిందట రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు శిఖం భూముల ఆక్రమణపై ఫిర్యాదు అందింది.

క్రమబద్ధీకరణకు భారీ స్కెచ్

వంద ఫీట్ల రోడ్డుకు ఆనుకొని ఉన్న శిఖం భూమిని హస్తగతం చేసుకునేందుకు కొందరు భారీ స్కెచ్ వేశారు. చెరువు విస్తరించి ఉన్న సర్వే నంబర్లలో 155 కూడా ఉన్నది. ఈ సర్వే నెంబరుపై ఇద్దరు వ్యక్తులు పాత పట్టా పాసు పుస్తకాలు సృష్టించారు. ఒక వ్యక్తిపై 9 గుంటలు, మరో వ్యక్తిపై 27 గుంటల భూమితో జల్‌పల్లి గ్రామపరిధిలో 155 సర్వే నంబరు మీద పట్టా పాసు పుస్తకం నంబరు 135, 136గా పత్రాలు రూపొందించారు. శిఖం భూమిలో మట్టి నింపి, రెండు గదులను కూడా నిర్మించారు. పాత పట్టా పాసు పుస్తకాల ప్రతుల ఆధారంగా 2022లో విద్యుత్తు కనెక్షన్లు తీసుకున్నారు. మున్సిపల్ నుంచి ఇంటి నంబరు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది. ఈ ప్రక్రియ పూర్తికాగానే 59 జీవో కింద క్రమబద్ధీకరించుకోవాలనేది వీరి ప్రణాళిక. ఇక్కడ గజం విలువ కనీసం రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు ఉంటుంది. ఈ క్రమంలో 36 గుంటల భూమి ధర కనిష్ఠంగా రూ.50 కోట్ల పైమాటే.

అవి నకిలీ పత్రాలే

2018లో కేసీఆర్ ప్రభుత్వం పాత పాస్ పుస్తకాల స్థానంలో కొత్త వాటిని జారీ చేసింది. కనీసం ఈ మాత్రం వాస్తవాన్ని పట్టించుకోకుండా విద్యుత్తుశాఖ అధికారులు 2022లో పాత పాస్ పుస్తకాల ప్రతులు మీద మీటర్లు ఇవ్వటం గమనార్హం. దీంతో పాటు 155 సర్వే నంబరు చెరువు శిఖం అని రికార్డుల్లో ఉన్నా రెవిన్యూ అధికారులు పట్టించుకోలేదు. పాత పాస్ పుస్తకాల నంబర్లపై ఆరా తీయగా, జల్‌పల్లి రెవిన్యూ రికార్డుల్లో పట్టా పాస్ పుస్తకాల నంబర్లు 75తోనే ముగిశాయి. అంటే ఇవి నకిలీవని స్పష్టంగా అర్థమవుతున్నది.

చర్యలకు అధికారుల తర్జనభర్జన

జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు నేపథ్యంలో మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ల్యాండ్ ప్రొటెక్షన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గత నెల 29న కందుకూరు ఆర్డీవో, బాలాపూర్ తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు. కానీ కిందిస్థాయి అధికారులు విచారణకు మాత్రం వెనకా ముందు ఆడుతున్నట్టు తెలుస్తున్నది. కనీసం సర్వే నిర్వహించకపోవటం, ఆక్రమణలను తొలగించకపోవటం వెనక ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీనిపై బాలాపూర్ తహసీల్దార్ మాధవరెడ్డిని సంప్రదించగా, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ఇంకా తనకు నివేదిక ఇవ్వలేదని, నివేదిక ఇచ్చిన తర్వాత ఉన్నతాధికారులకు పంపిస్తానని పేర్కొన్నారు.

లంచమిస్తే అరెస్టు చేయం

- ముఠాగా చైతన్యపురి పోలీసులు
- ఏసీబీ సోదాలు.. ముగ్గురు ఖాకీల అరెస్టు
- నలుగురు ప్రైవేటు వ్యక్తులు కూడా

అరెస్టయిన కానిస్టేబుళ్లు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 18 (నమస్తే తెలంగాణ): మీపై చీటింగ్ కేసు నమోదైందా? అరెస్టు నుంచి తప్పించుకోవాలనుకుంటున్నారా? మీరు మా చేతులు తడిపితే చాలు అరెస్టును తప్పించేస్తాం అంటున్నారు ముగ్గురు ఖాకీలు. చైతన్యపురి పోలీస్‌స్టేషన్ అడ్డాగా లంచాలతో చెలరేగిపోతున్నారు. చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే మల్లేశం (కానిస్టేబుళ్లు), ప్రసాద్‌బాబు (హెడ్ కానిస్టేబుల్, వారెంట్ ఎగ్జిక్యూషన్ టీమ్), ఎం నరేందర్ (కానిస్టేబుల్, కోర్టు విధులు నిర్వహించే టీమ్), మరో నలుగురు ప్రైవేట్ వ్యక్తులు సోమశేఖర్, రామకృష్ణ, ఏవీఎన్ఏసీ కుమార్ అచ్చుతున అలియాస్ చైతన్య, రాఘవేందర్ గుప్తతో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. 2022లో మేనేజ్‌మెంట్ కోటాలో మెడికల్ సీట్లు ఇప్పిస్తానని మోసాలకు పాల్పడిన అంగె వెంకటరమణపై చైతన్యపురి ఠాణాలో రెండు చీటింగ్ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో వెంకటరమణ కోర్టుకు హాజరుకాకపోవడంతో న్యాయస్థానం వారెంట్లు జారీ చేసింది. ఈ ముఠా వెంకటరమణను కలిసింది. 'నీపై వారెంట్లు జారీ అయ్యాయి. నిన్ను అరెస్టు చేసి ఇప్పుడే తీసుకెళ్తాం. వారెంట్లను పక్కన పెట్టాలంటే రూ.5 లక్షలు ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. అందులో రూ.3 లక్షలు తన తండ్రి బ్యాంకు ఖాతా నుంచి ప్రైవేట్ వ్యక్తుల ద్వారా వెంకటరమణ కానిస్టేబుళ్లకు పంపించాడు. మరికొంత సొమ్మును కూడా పలు దఫాలుగా అందించాడు. అయినా వారెంట్ సాకుతో బెదిరిస్తూ ఇంకా డబ్బులు ఇవ్వాలని వేధిస్తున్నారు. ఈ ముఠా వేధింపులు తాళలేక వెంకటరమణ ఏసీబీని ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు.. ముగ్గురు కానిస్టేబుళ్లతోపాటు నలుగురు ప్రైవేట్ వ్యక్తులను గురువారం అరెస్టు చేశారు.

కూలిపోయిన గ్రీన్ ఫీల్డ్ హైవే వంతెన స్లాబ్

నిర్మాణ దశలోనే కూలిన గ్రీన్‌ఫీల్డ్ వంతెన

- ముగ్గురు కూలీలకు స్వల్ప గాయాలు

వైరాటౌన్, జనవరి 18 : గ్రీన్ ఫీల్డ్ హైవే వంతెన నిర్మాణ దశలో కూలిపోవడంతో ముగ్గురు కూలీలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ఖమ్మం జిల్లా వైరా మండలం సోమవరం గ్రామం వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేలో భాగంగా సోమవరం గ్రామం వద్ద మధ్యాహ్నం అండర్ పాస్ వంతెనకు స్లాబ్ వేశారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ముగ్గురు కూలీలకు స్వల్ప గాయాలు. కాగా కూలీలకు పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్లాబ్ వేసిన గంటల వ్యవధిలోనే కూలిపోవడంతో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

రైల్వే ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం

- మర్రి రాఘవయ్య

బన్సీలాల్‌పేట్, జనవరి 18: రైల్వే ఉద్యోగుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతామని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ 32వ ద్వైవార్షిక సర్వసభ్య మండలి సమావేశం గురువారం సికింద్రాబాద్ రైల్ కళారంగ్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. దీనికి హాజరైన రాఘవయ్య మాట్లాడుతూ.. రైల్వే కార్మికులు, ఉద్యోగులకు పాత పెన్షన్ పద్ధతి అమలు చేయాలని, రైల్వేలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, ఉద్యోగులకు పని గంటలు తగ్గించాలని, ఓపెన్ లైన్‌లో పనిచేసే స్టాఫ్‌కు రిస్క్ అలవెన్స్ పెంచాలని, రైల్వే కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందిని పెంచాలని, 7వ కేంద్ర పీఆర్సీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను జాతీయ ఎన్ఎఫ్ఐఆర్ సమాఖ్య ద్వారా ప్రధాని మోదీకి విన్నవిస్తామని వెల్లడించారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ.. ఉద్యోగుల అంకితభావం, సమష్టి కృషి ఫలితంగా ఉత్తమ ఫలితాలు, అవార్డులు వస్తున్నాయని అన్నారు. సమావేశంలో చీఫ్ పర్సనల్ ఆఫీసర్ కిశోర్‌బాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీధర్, సంఘ్ అధ్యక్షుడు ప్రభాకర్ ఆంధ్రూస్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆదం సంతోష్‌కుమార్, ఏజీఎస్‌లు భరణిభాను ప్రసాద్, రుద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిఫాల్ట్ మిల్లర్లపై 25% పెనాల్టీ

- 31లోగా సీఎమ్మార్ ఇవ్వాల్సిందే
- పౌరసరఫరాల శాఖ డంపింగ్ యార్డు కాదు
- కమిషనర్ చౌహాన్ హెచ్చరిక

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): మిల్లర్లు వారికి ఇష్టమొచ్చినప్పుడు ఇష్టమొచ్చినంత బియ్యం ఇవ్వడానికి సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఏమీ డంపింగ్ యార్డు కాదని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ హెచ్చరించారు. ఎఫ్‌సీఐకి బియ్యం ఎగ్గొట్టి నాసిరకం బియ్యాన్ని సివిల్‌సప్లైకి కట్టబెడతామంటే కుదరదని స్పష్టంచేశారు. ఎఫ్‌సీఐకి బియ్యం ఇవ్వకుండా డిఫాల్ట్ అయిన మిల్లర్ల నుంచి 25% పెనాల్టీ వసూలు చేస్తామని హెచ్చరించారు. సీఎమ్మార్, రేషన్ బియ్యం నాణ్యత, గన్నీ సంచుల సేకరణ తదితర అంశాలపై గురువారం ఆయన ఎంసీఆర్‌హెచ్చార్డీలో అడిషనల్ కలెక్టర్లు, డీసీఎస్‌వోలు, డీఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చౌహాన్ మాట్లాడుతూ.. గత ఏడాది వానకాలం ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన సీఎమ్మార్‌ను ఈ నెల 31లోగా ఎఫ్‌సీఐకి అందజేయాలని ఆదేశించారు. మిల్లర్ల నుంచి సీఎమ్మార్ కింద రావాల్సిన ప్రతి బియ్యపు గింజను వసూలు చేయాలని అడిషనల్ కలెక్టర్లకు సూచించారు.



తాండూరు డిపో కండక్టర్ కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

కండక్టర్ కుటుంబానికి 40 లక్షల బీమా సొమ్ము

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టీఎస్ఆర్టీసీ తాండూరు డిపో కండక్టర్ లక్ష్మణ్ కుటుంబానికి సంస్థ యాజమాన్యం అండగా నిలిచింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) సహకారంతో రూ.40 లక్షల బీమా సొమ్మును అందించి బాధిత కుటుంబానికి భరోసా కల్పించింది. హైదరాబాద్ బస్‌భవన్‌లో గురువారం కండక్టర్ లక్ష్మణ్ భార్య జ్యోతి, కుమారుడు అనిల్‌కుమార్‌కు రూ.40 లక్షల విలువైన చెక్కును యూబీఐ అధికారులతో కలిసి ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ అందజేశారు. యూబీఐ సూపర్ వేతన సేవింగ్ అకౌంట్ ద్వారా ఉచిత ప్రమాద బీమా కింద ఈ సొమ్మును బాధిత కుటుంబానికి అందజేశారు.

22న అన్ని ఆలయాల్లో పూజలు నిర్వహించాలి

- దేవాదాయ శాఖ కమిషనర్‌కు వీహెచ్‌పీ వినతి

హైదరాబాద్, జనవరి 18(నమస్తే తెలంగాణ): అయోధ్య రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 22న రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్‌కుమార్‌కు గురువారం వీహెచ్‌పీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు పండరీనాథ్, జగదీశ్వర్, పగుడాకుల బాలస్వామి, భజరంగ్‌దళ్ కన్వీనర్ శివరాములు, కో-కన్వీనర్ జీవన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్‌పై ఈడీ ప్రశ్నల వర్షం

- రూ.200 కోట్ల లావాదేవీలు ఎలా జరిగాయి?
- యశ్వంత్ రియల్టర్స్‌తో మీకున్న సంబంధం ఏమిటి?
- హేతుబద్ధత లేకుండా 100 కోట్లు ఎలా తరలించారు?
- విశాఖ ఇండస్ట్రీస్, విజిలెన్స్ సెక్యూరిటీస్ కేసుల్లో విచారణ

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఆ పార్టీ సీనియర్ నేత గడ్డం వివేక్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయన ఖాతా నుంచి రూ.8 కోట్ల బదిలీపై సమాచారం అందుకున్న ఈడీ అధికారులు.. ఈసీ ఆదేశాలతో కేసు నమోదు చేశారు. ఇందుకు సంబంధించి గురువారం ఈడీ అధికారులు ఆయనను విచారించారు. విజిలెన్స్ సెక్యూరిటీ, విశాఖ ఇండస్ట్రీస్ పేరుతో జరిగిన అక్రమ లావాదేవీలపైనే ఈడీ అధికారులు దృష్టి సారించినట్టు తెలిసింది. ముఖ్యంగా ఎమ్మెల్యే వివేక్‌కు చెందిన బోగస్ కంపెనీల నుంచి జరిగిన రూ.200 కోట్ల అక్రమ లావాదేవీల గుట్టు విప్పేందుకు సుమారు 4 గంటలపాటు పలు ప్రశ్నలు సంధించినట్టు విశ్వసనీయ సమాచారం. గత నవంబర్‌లో విశాఖ ఇండస్ట్రీస్, విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాల్లో తనిఖీల్లో దొరికిన ఆధారాలతో మంచిర్యాల, హైటెక్‌సిటీ, సోమాజిగూడ, రామగుండంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. వివేక్ అకౌంట్ నుంచి విశాఖ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌కు రూ.8 కోట్లు బదిలీ విషయమై చేపట్టిన సోదాల్లో రూ.200 కోట్లకుపైగా అక్రమాలు వెలుగుచూశాయి. గతంలో ఈడీ అధికారులు జరిపిన సోదాల్లో విజిలెన్స్ సెక్యూరిటీ సంస్థ.. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) నిబంధనలు ఉల్లంఘించినట్టు తేల్చారు. అయితే, ఈ సెక్యూరిటీ సంస్థకు 'యశ్వంత్ రియల్టర్స్' మాతృసంస్థగా ఉన్నదని గుర్తించారు. ఓ బోగస్ సంస్థకు యశ్వంత్ రియల్టర్స్ మాతృసంస్థగా ఎలా అవతరించిందనే అంశంపై వివేక్ నుంచి వివరాలు రాబట్టారు. యశ్వంత్ రియల్టర్స్‌లో ఫెమా నిబంధనలకు విరుద్ధంగా విదేశీయుల షేర్లు ఎక్కువగా ఉన్నట్టు గతంలో ఈడీ అధికారులు తేల్చారు. యశ్వంత్ రియల్టర్స్‌తో ఉన్న సంబంధం, వివేక్ పాత్రపై స్పష్టత తీసుకున్నారని తెలిసింది.

ఫెమా రూల్స్ ఉల్లంఘించలేదు: వివేక్

ఈడీ విచారణ ఎదుర్కొన్న కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం వివేక్.. తాను ఫెమా నిబంధనలు ఉల్లంఘించలేదని మీడియాతో చెప్పారు. తాను బీజేపీ నుంచి బయటకు వచ్చాకే ఈడీ సోదాలు జరిగాయని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి వ్యక్తిగత కక్షతో సోదాలు చేయించాయని ఆరోపించారు. అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పానని, మరోసారి విచారణకు హాజరు కావాల్సిన అవసరం లేదని ఈడీ అధికారులు స్పష్టం చేసినట్టు వెల్లడించారు. ఏవైనా పత్రాలు అవసరమైతే సమర్పించడానికి సిద్ధంగా ఉండాలని ఈడీ సూచించిందని పేర్కొన్నారు.

రూ.కోట్లు చేతులెలా మారాయి?

విశాఖ ఇండస్ట్రీస్, విజిలెన్స్ సెక్యూరిటీస్ నుంచి తరచూ రూ.100 కోట్ల లావాదేవీలు ఎలాంటి నిజమైన వ్యాపార హేతుబద్ధత లేకుండా జరిగినట్టు ఈడీ గతంలోనే గుర్తించింది. అప్పుడే ఆ డబ్బు కూడా విజిలెన్స్ సెక్యూరిటీ రాబడి కాదని ఆధికారులు వెల్లడించారు. ఆ సంస్థ రాబడి కానప్పుడు రూ.100 కోట్లు ఎవరెవరికి ఇచ్చారు? అవి చేతులెలా మారాయి? అనే ప్రశ్నలు సంధించినట్టు తెలిసింది. రూ.20 లక్షల ఆదాయం మాత్రమే వస్తే రూ.వంద కోట్ల లావాదేవీలు ఎలా జరిగాయో చెప్పాలని అడిగినట్టు సమాచారం. ఈ రెండు కంపెనీలను వివేక్ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలా నియంత్రిస్తున్నారో ప్రశ్నించినట్టు తెలిసింది. దర్యాప్తులో భాగంగా విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీని ఈడీ అధికారులు ఓ బోగస్ సంస్థగా తేల్చారు.

అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి

- మెదక్‌లో మాలమహానాడు కార్యకర్తల నిరసన
- సెల్‌టవర్ ఎక్కి రెండు గంటలపాటు ఆందోళన

సెల్‌టవర్ ఎక్కిన కార్యకర్తలు

మెదక్, జనవరి 18 (నమస్తే తెలంగాణ) : పీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మాల మహానాడు నాయకులు గురువారం మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో సెల్‌టవర్ ఎక్కి రెండు గంటలపాటు ఆందోళనకు దిగారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఫోన్‌లో మాట్లాడి నచ్చజెప్పడంతో కిందికి దిగారు.

'కొనసాగుతున్న' రిటైర్డ్ అధికారులు 1049!

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): పదవీ విరమణ చేసినా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారి లెక్కలు తేలినట్టు సమాచారం. అన్నిశాఖల్లో కలిపి 1049 మంది ఉన్నారని సీఎస్ శాంతి కుమారికి అధికారులు గురువారం నివేదిక అందించినట్టు తెలిసింది. అన్ని శాఖల్లో కొనసాగుతున్న రిటైర్డ్ ఉద్యోగుల వివరాలు ఇవ్వాలని ఈ నెల 16న సీఎస్ అన్ని శాఖల కార్యదర్శులను ఆదేశించారు. విభాగం, హోదా, రిటైర్ అయిన సంవత్సరం, ఇప్పుడు ఇస్తున్న వేతనం వంటి పూర్తి వివరాలు ఇవ్వాలని సీఎస్ పేర్కొన్నారు. ఈ మేరకు అన్నిశాఖల నుంచి సమాచారం రాగా, జీఏడీ అధికారులు క్రోడీకరించి నివేదిక సిద్ధం చేసినట్టు విశ్వసనీయ సమాచారం. అత్యధికంగా మున్సిపల్ శాఖలో 179 మంది కొనసాగుతున్నారని, ఉన్నత విద్యాశాఖలో 88 మంది, ఆర్‌అండ్‌బీలో 81 మంది, పౌరసరఫరాల శాఖలో 75 మంది, నీటిపారుదల శాఖలో 70 మంది ఉన్నట్టు నివేదికలో పేర్కొన్నారని సమాచారం. ఇందులో రిటైర్డ్ ఐఏఎస్‌లు, ఐఎఫ్ఎస్‌లు, కన్ఫర్డ్ ఐఏఎస్‌లు, గ్రూప్ వన్ ఆఫీసర్లు, ఇతర హోదాల్లో పనిచేసిన వారు ఉన్నారని అధికారులు తేల్చారు. వీరికి జీతభత్యాలకు నెలకు రూ.150 కోట్ల వరకు ఖర్చవుతుందని, ఏటా సుమారు రూ.1,800 కోట్లు అవసరమని పేర్కొన్నట్టు తెలిసింది. ఈ నివేదికను సీఎం రేవంత్‌రెడ్డికి అందజేసిన తర్వాత తుది నిర్ణయం తీసుకోనున్నట్టు ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

తెలంగాణ జల విద్యుత్తుకు కేఆర్ఎంబీ గండం!

మొదటిపేజీ తరువాయి...

వచ్చిన ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్టు అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా ససేమిరా అంటూ తొమ్మిదేండ్లు పోరాడిన ఫలితం.. ఇప్పుడు నీరుగారిపోతున్నది. తాజాగా కేంద్ర జల్ శక్తి వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన సమావేశంలో కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) పరిధిలోకి ప్రాజెక్టులతోపాటు జల విద్యుత్తు కేంద్రాలనుకూడా తీసుకురావడానికి సూత్రప్రాయంగా అంగీకరించినట్టు తెలిసింది. అంటే మన జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను కృష్ణా బోర్డుకు అప్పగించే తరుణం త్వరలోనే ఉన్నదనే చెప్పవచ్చు. ఇలా జరిగితే.. తెలంగాణ జల విద్యుత్తు కేంద్రాలు అటకెక్కినట్టే. మన ప్రభుత్వానికి విద్యుత్తు విషయంలో భారీ నష్టం తప్పదు. గ్రిడ్ వైఫల్యం చెందే ప్రమాదం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జలవిద్యుత్తు కోసమే శ్రీశైలం

శ్రీశైలం ప్రాజెక్టు కేవలం జల విద్యుత్తు ఉత్పత్తి కోసమే నిర్మించింది. రికార్డుల్లో జల విద్యుత్తు కోసమే అని స్పష్టంగా ఉంటుంది కూడా. దీని వల్ల 264 టీఎంసీల నీటిని దిగువన ఉన్న సాగర్ రిజర్వాయర్‌లోకి విడుదల చేస్తూ జల విద్యుత్తును ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుంది. కాలగమనంలో సీమాంధ్ర పాలకులు శ్రీశైలానికి పోతిరెడ్డిపాడు వద్ద బుంగ పెట్టి క్రమంగా జల విద్యుత్తుకు అడ్డంకులు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే శ్రీశైలం ప్రాజెక్టు జల విద్యుత్తు కోసమే కాబట్టి ఇక్కడ తెలంగాణకు శ్రీశైలం(ఎడమగట్టు) జల విద్యుత్తు కేంద్రంలో 900 మెగావాట్లుతోపాటు.. నాగార్జునసాగర్ జల విద్యుత్తు కేంద్రం 815.6 మెగావాట్లు, సాగర్ లెఫ్ట్ కెనాల్‌పై ఉన్న జలవిద్యుత్తు కేంద్రం 60 మెగావాట్ల జల విద్యుత్తు ఉత్పత్తి అనేది పూర్తిగా సందిగ్ధంలో పడింది.

కాంగ్రెస్, బీజేపీ దోస్తానా ఫలితమా?

తాజాగా కాంగ్రెస్ సారథ్యంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన ఒకటిన్నర నెలలోనే ఢిల్లీ సమావేశంలో కేఆర్ఎంబీకి జల విద్యుత్తు ప్రాజెక్టులపై అజమాయిషీకి నిర్ణయం తీసుకోవటం కాంగ్రెస్, బీజేపీ మిత్రత్వంతోనే సాధ్యమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. వాటి సాన్నిహిత్యంతోనే తెలంగాణ జల విద్యుత్తును, హక్కులను కేఆర్ఎంబీకి దఖలు పర్చేందుకు సిద్ధపడ్డారనే విమర్శలు చేస్తున్నారు. ఇన్నేండ్లు కాపాడుకుంటున్న వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా ఇతర సంస్థలకు అప్పజెప్పడం ఏమిటని, రాష్ట్ర హక్కులను కాపాడేది ఎవరంటూ ప్రశ్నిస్తున్నారు.

కేఆర్ఎంబీ చేతిలోకి గరిష్ఠంగా జల విద్యుత్తు కేంద్రాలు

తెలంగాణ జల విద్యుత్తు కేవలం కృష్ణా నదిపైనే కేంద్రీకృతమై ఉన్నది. రాష్ట్రంలో మొత్తం 2,441.76 మెగావాట్ల జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలు ఉండగా, కృష్ణా నదిపైనే జూరాల (234 మెగావాట్లు), శ్రీశైలం (900 మెగావాట్లు), సాగర్ లెఫ్ట్ కెనాల్ (60 మెగావాట్లు), నాగార్జునసాగర్ (815.6 మెగావాట్లు), లోయర్ జూరాల (240 మెగావాట్లు), పులిచింతల (120 మెగావాట్లు) ద్వారా మొత్తం 2,369.6 మెగావాట్ల జల విద్యుత్తు కేంద్రాలు ఉన్నాయి. ఇందులో శ్రీశైలం, నాగార్జునసాగర్, సాగర్ లెఫ్ట్ కెనాల్‌పై ఉన్న 1,775.6 మెగావాట్ల జల విద్యుత్తు కేంద్రాలు కేఆర్ఎంబీ చేతిలోకి వెళ్లిపోతాయి. 594 మెగావాట్ల ప్రాజెక్టులు మాత్రమే మన జెన్‌కో ఆధీనంలో ఉంటాయి. ఇందులోనూ సగం విద్యుత్తు కర్ణాటకకు (ఒప్పందం ప్రకారం) ఇవ్వాల్సి ఉంటుంది. గోదావరి నదిపై ఉన్న 72.16 మెగావాట్ల చిన్న జల విద్యుత్తు ప్లాంట్లపై మాత్రమే మన ప్రభుత్వ అజమాయిషీ ఉంటుంది.

5 వేల మిలియన్ యూనిట్లు కష్టమే

ప్రాజెక్టుల నిర్వహ